భట్టి భాష్యం.. ఒట్టి అబద్ధం

'నమస్తే' కథనాన్ని తప్పుబట్టిన భట్టి
వాస్తవాలు మాత్రమే ప్రచురణ
దానినే తప్పుబట్టిన అమాత్యుడు
అనాలోచిత నిర్ణయం వల్లే కూలిన గోడ
వీడియో తీసింది అక్కడి వారే

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): సుంకిశాల ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గురువారం మింట్ కంపౌండ్‌లోని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో స్పందించారు. 'నమస్తే తెలంగాణ' పత్రిక కథనాన్ని చూపుతూ పలు వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో భట్టి చేసిన వ్యాఖ్యలు..అవి ఒట్టి బూటకం అనేందుకు ఉదాహరణలు కొన్ని.

భట్టి: కృష్ణానదిలో డెడ్‌స్టోరేజీ నుంచి కూడా హైదరాబాద్ నగరానికి మంచినీళ్లు తెచ్చేందుకు సుంకిశాల పథకం చేపడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాదం జరిగేలా నిర్మాణం చేపడుతుందనే అర్థం వచ్చేలా 'నమస్తే తెలంగాణ'లో ఒక కథను వండి వార్తారు.

వాస్తవం: సుంకిశాల ఘటన జరిగిందని, వారం రోజులుగా బయటి ప్రపంచానికి తెలియదని, పెను ప్రమాదం తప్పిందని జరిగిన సంఘటనను మాత్రమే 'నమస్తే తెలంగాణ' రిపోర్టు చేసింది. అందులో చూపిన వీడియో 'నమస్తే తెలంగాణ' ప్రతినిధులు తీసినది కాదు. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడే ఉన్నవారు, పథకం పనులను నిర్వహిస్తున్న వారు చిత్రీకరించింది. అందులో జరిగిన దృశ్యాలనే వార్తలో ప్రస్తావించారే తప్ప సొంత కవిత్వంతో రాసిన కథనం కాదు అది. వాస్తవం చెబితే భుజాలు ఎందుకు తడుముకున్నారో మరి!

భట్టి: సుంకిశాల ప్రాజెక్టుకు సంబంధించి 11.6.2021నాడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒప్పందం జరిగింది. 2022లో పనులు మొదలుపెట్టారు. జూలై 2, 2023 నాడు కుప్పకూలిన వాల్ నిర్మాణం జరిగింది. కట్టించింది బీఆర్ఎస్ ప్రభుత్వమే.

వాస్తవం: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒప్పందం, నిర్మాణ పనులు శరవేగంగా జరిగాయనేది వాస్తవం. కానీ సుంకిశాల ఘటనకు కారణమైన గేటు అమరిక, సొరంగాన్ని ఓపెన్ చేసే పనులు గత నెలలో అంటే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగాయి. గోడ కుప్పకూలేందుకు కారణం పనుల్లో నాణ్యత లోపం కాదు. రిటెయినింగ్ వాల్ నిర్మాణ డిజైన్ అంతకంటే కాదు. ప్రతికూల సమయంలో హడావుడి, అనాలోచిత నిర్ణయం కారణంగా ప్రమాదం జరిగింది. స్వయానా జలమండలి అధికారులు అధికారికంగా ఇచ్చిన పత్రికా ప్రకటనలో ఈ వాస్తవం స్పష్టంగా ఉంది.

భట్టి: సాగర్‌లోకి నీళ్లొచ్చాయట.. కూలిందట! సాగర్‌లోకి నీళ్లు రాకుంటే ఏమొస్తాయ్. సాగర్ కట్టిందే నీళ్ల కోసం. ఆ నీళ్ల నుంచే కదా పంపుహౌజ్ ద్వారా నీళ్లు తెచ్చుకుందామని కట్టుకుంది. అవన్నీ ధృష్టిలో పెట్టుకొనే కదా కట్టాల్సింది. డిజైన్లు ఎంత లోపభూయిష్టంగా ఉన్నాయో దీని ద్వారా అర్థమవుతున్నది. మీ పాలన, మీ పర్యవేక్షణ ఎలా ఉన్నాయో అర్థమవుతున్నది.

వాస్తవం: సాగర్‌లోకి ఊహించని రీతిలో, ఊహించని సమయంలో నీళ్లు వచ్చాయి. అందుకే ఈ ప్రమాదం జరిగిందనేది జలమండలి అధికారుల అధికారిక ప్రకటన సారాంశం. అధికారులు, ఏజెన్సీకి ఈ కఠోర వాస్తవం తెలియదు కాబోలు. సాగర్ అంటే అందులో నీళ్లుండవు, నీటి కోసమే సాగర్ నిర్మాణం చేపట్టారనే వాస్తవాలు తెలిక సొరంగాన్ని పూర్తి స్థాయిలో ఓపెన్ చేశారేమో! దాని ఫలితంగా ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చు. డిజైన్లు, నాణ్యత అనేవి ప్రమాదానికి కారణం కాదని జలమండలి అధికారులే స్పష్టం చేశారు. ఇక, పాలన, పర్యవేక్షణ అంటే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్నందున ఆ బాధ్యత ఎవరిదనేది పురపాలక శాఖ పోర్టుఫోలియో నిర్వహిస్తున్న వారికే తెలియాలి.

భట్టి: కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే గోడ కూలిందనే చెప్పే ప్రయత్నం చేశారు. కానీ అది మేం కట్టింది కాదు.. కట్టించింది కాదు. మా హయాంలో మొదలు పెట్టింది కాదు. తమలి (బీఆర్ఎస్) పుణ్యమే ఇది కూడా. ఒళ్లుగగుర్పొడిచే వీడియో కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి అని గొప్పగా మార్కెట్ చేసుకునే ప్రయత్నం చేశారు. ఎవరి మీదనో బురద చల్లేందుకు ప్రయత్నం చేశారు.

వాస్తవం: కట్టింది, కట్టించింది కాంగ్రెస్ ప్రభుత్వం కాకపోవచ్చుగానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎనిమిది నెలలకు రిటెయినింగ్ వాల్ కుప్పకూలిందనేది నిర్వివాదాంశం. ఇక, ఒళ్లు గగుర్పొడిచే వీడియో అంటే.. ఘటన జరిగి వారం రోజులైనా ప్రభుత్వం దానిని దాచిపెట్టింది. సంఘటన జరిగిందనే వాస్తవాన్ని ప్రజల ముందు ఉంచాల్సిన బాధ్యతనే 'నమస్తే తెలంగాణ' నిర్వర్తించింది. ఆ వీడియోను బయటి ప్రపంచానికి చూపించింది. గత పది, పదిహేను రోజుల్లో ఇంజినీర్లు తీసుకున్న నిర్ణయాలే ప్రమాదానికి కారణమనేది జలమండలి వివరణలోనూ ఉన్నందున పాపమో.. పుణ్యమో.. గత బీఆర్ఎస్ ప్రభుత్వానిది కాదని తేలింది.

కొసమెరుపు: నాగార్జున సాగర్ ప్రాజెక్టును కాంగ్రెస్ కట్టింది. కృష్ణాకు భారీ వరద వచ్చినప్పుడు, దానిని గమనిస్తూ ప్రభుత్వం సకాలంలో గేట్లు తెరవాల్సి ఉంటుంది. ఒకవేళ అలా చేయకుండా ఏదైనా ప్రమాదం జరిగితే ఆ తప్పుకు బాధ్యత సాగర్ ప్రాజెక్టు కట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానిది అవుతుందా? లేక, అధికారంలో ఉండి నిర్లక్ష్యం వహించిన అప్పటి ప్రభుత్వానిది అవుతుందా? భట్టిగారు చెప్పాలి.

జలమండలి చెప్పిన నిజం

సుంకిశాల పాపాన్ని బీఆర్ఎస్‌పైకి నెట్టే ప్రయత్నం చేసిన మంత్రులు భట్టి, పొన్నం
జలమండలి వివరణతో దొరికిన ప్రభుత్వం
ఏజెన్సీపైకి తప్ప నెట్టేసే ప్రయత్నం
మీడియా సమావేశానికి ముందు జలమండలి ఇంజినీర్లను కలిసిన భట్టి

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): 'మంచైతే మాది.. చెడు అయితే మీది' అన్నట్టుగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. సుంకిశాల ఘటనను కూడా గత ప్రభుత్వం మీదికి నెట్టేసి చేతులు దులుపుకోవాలని చూస్తున్నది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ ఇదే ప్రయత్నం చేశారు. అయితే, జలమండలి వివరణతో ప్రభుత్వం అడ్డంగా దొరికిపోయింది. అది కూడా తమపైకి రాకుండా నెపాన్ని ఏజెన్సీపైకి నెట్టివేసే ప్రయత్నం చేసింది. 'వచ్చే వేసవిలోగా నీరు అందించాలనే ఉద్దేశంతో మిడిల్ టన్నెల్ పూర్తి చేయడానికి ఏజెన్సీ నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం వారు సంప్ వైపు టన్నెల్‌పై గేటును ఏర్పాటు చేశారు. రిజర్వాయర్ వైపు ఉన్న మట్టిని తొలగించారు. అదే సమయంలో సివిల్ వర్క్స్ టీమ్స్ సైడ్‌వాల్స్ మధ్య టై బీమ్ కనెక్టివిటీని కాస్టింగ్ చేసే పనిలో ఉన్నాయి. రిజర్వాయర్‌కు వరద ఆలస్యంగా వస్తుందని, ఈ ఏడాది ఆగస్టు చివరి నాటికి మధ్య టన్నెల్ స్థాయికి లెవల్ పెరుగుతుందని ఏజెన్సీ భావించింది. ఆగస్టు చివరి నాటికి అవసరమైన టై బీములను పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. అదే సమయంలో మిడిల్ టన్నెల్ కోసం గేట్ ఫిక్సింగ్ పనులు చేపట్టారు. జూలై 29, 30, 31 తేదీల్లో గేటు బిగింపు పనులు జరిగాయి. ఇదే సమయంలో నాగార్జున సాగర్‌కు ఒక్కసారిగా భారీ ప్రవాహం పెరిగింది. దాదాపు 3.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో రిజర్వాయర్ వద్ద అకస్మాత్తుగా బ్యాక్ క్లోజ్ వేవ్ యాక్షన్ పెరిగి నీళ్లు టన్నెల్‌లోకి వచ్చాయి. దీంతో టన్నెల్ గేటు ధ్వంసమై దానికి అనుసంధానంగా ఉన్న సైడ్‌వాల్ కూలిపోయింది. ఇదంతా ఐదు నిమిషాల స్వల్ప వ్యవధిలోనే జరిగింది. రిజర్వాయర్ సంపు పూర్తిస్థాయి నీటిమట్టంతో నిండిపోయింది'.. ఇదీ, సుంకిశాల కూలిన ఘటనపై గురువారం జలమండలి కార్యాలయం నుంచి వచ్చిన అధికారిక వివరణలోని సారాంశం. అన్నం ఉడికిందో, లేదో తెలుసుకునేందుకు ఒక మెతుకు పట్టుకుంటే చాలు.. అన్నట్టుగా సుంకిశాల ఘటనకు కారణం కూడా అంతే. కాళేశ్వరాలు.. పాపాలు.. అని ఊదరగొట్టడం అప్పటికప్పుడు కొంత పనికొస్తుందేమో కానీ, నికార్సయిన కారణాన్ని తేల్చాలంటే సాంకేతికంగా ఏం జరిగిందో చూడాలి. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిగ్గు తేల్చాలి. అది ప్రభుత్వ కనీస బాధ్యత. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దలు ఆ బాధ్యతను మరిచారు. కానీ నిజం నిప్పులాంటిది. దాస్తే దాగదు కదా. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియా సమావేశం నిర్వహించి, నిరాధార ఆరోపణలు చేసిన కొద్ది గంటల్లోనే జలమండలి అధికారులు అధికారిక ప్రకటన విడుదల చేశారు. దీంతో జలమండలి నిజం.. భట్టి అబద్ధం.. అని తేలిపోయింది.

గేట్లు బిగించకుంటే ముందుగానే సాగర్‌కు భారీ ఇన్‌ఫ్లో

గత నెల 29-31 తేదీల్లో సొరంగ గేట్లు అమర్చామని జలమండలి అధికారులు తెలిపారు. ఆ తర్వాత సాగర్‌కు మూడున్నర లక్షల క్యూసెక్కుల వరద రావడంతో ప్రమాదం జరిగినట్టు వివరణలో పేర్కొన్నారు. కానీ వాస్తవంగా జూలై 27 నుంచే వరద 50 వేల క్యూసెక్కులకు మించి రావడం మొదలైంది. అదే సమయంలో శ్రీశైలం జలాశయానికి 4.12 లక్షల క్యూసెక్కుల వరద కొనసాగుతున్నది. అంటే దిగువకు వరద పెరుగుతున్నదని ఎవరైనా సులువుగా అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు గేట్ల బిగింపు చివరి రోజు 31వ తేదీన నాగార్జునసాగర్‌కు 2.18 లక్షల క్యూసెక్కుల వరద కొనసాగుతున్నది. గేట్ల బిగింపు తర్వాతనే సొరంగం ఓపెన్ చేస్తారు. అంటే సొరంగం ఓపెన్ చేసే సమయానికి రెండు లక్షల క్యూసెక్కులకు పైగా వరద కండ్ల ముందే ఉంది. కానీ అనూహ్యంగా మూడున్నర లక్షల క్యూసెక్కుల వరద వచ్చిందని జలమండలి వివరణలో పేర్కొనడం అవాస్తవం. తాము ఊహించని విధంగా వరద ఒక్కసారిగా వచ్చి పడినందునే ఘటన జరిగిందని చెప్పే ప్రయత్నం చేశారు. కానీ వరద 50వేలు... లక్ష.. రెండు లక్షలు.. ఆపై మూడు లక్షల క్యూసెక్కులకు పెరిగింది.

అంతా అయిపోయిందనుకున్న సమయంలో!

ఘటన జరిగిన తర్వాత జలమండలి అధికారులు విషయాన్ని గోప్యంగా ఉంచారు. పంపుహౌజ్‌లోకి సీపేజ్ వాటర్ వచ్చినందున నిండిపోయిందని, అందుకే పనులు నిలిపివేసినట్టు అందరికీ చెప్తూ వచ్చారు. వాస్తవానికి పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శికి కూడా పూర్తి వివరాలు తెలియవని విశ్వసనీయంగా తెలిసింది. అంటే అసలు సుంకిశాల పథకం పనులను ఉన్నతస్థాయిలో ఏఒక్కరూ పర్యవేక్షించడంలేదని దీని ద్వారా అర్థమవుతుంది. మరోవైపు రిటెయినింగ్ వాల్ కూలిపోతున్న వీడియో దృశ్యాలు ఏజెన్సీ, అధికారులు ఎవరి దగ్గరా లేవు. అసలు వీడియో తీసినట్టుగా కూడా వారికి తెలియదు. అందుకే గోప్యత ఫలించిందని నిశ్చింతగా ఉన్నారు. కానీ 'నమస్తే తెలంగాణ' వీడియోను బయటి ప్రపంచానికి చూపిన తర్వాతనే అటు ఏజెన్సీ, ఇటు అధికారులకు అసలు తత్వం బోధపడింది. అందుకే గురువారం ఉదయం సుంకిశాల వద్ద లోతైన విచారణ కొనసాగింది. ఘటన జరిగిపుడు విధుల్లో ఎవరు ఉన్నారు? వీడియో ఎవరు తీశారు? 'నమస్తే తెలంగాణ' నుంచి ఎవరు వచ్చారు? ఎవరితో మాట్లాడారు? ఇలా అన్ని కోణాల్లోనూ విచారణ జరిగింది.

'నమస్తే తెలంగాణ' రాసిందే అక్షరాలా నిజం

సుంకిశాల ఘటనను వెలుగులోకి తీసుకువచ్చిన 'నమస్తే తెలంగాణ'.. ప్రతికూల సమయంలో సొరంగాన్ని తెరవడమే ప్రమాదానికి కారణమన్న నిపుణుల అభిప్రాయాన్ని స్పష్టం చేసింది. ముఖ్యంగా పంపుహౌజ్ స్లాబ్ నుంచి గేటుకు టై బీమ్స్ బిగించిన తర్వాతనే సొరంగాన్ని ఓపెన్ చేయాలనే సాంకేతిక మర్మాన్ని కూడా పేర్కొన్నది. అది చేయకపోవడంతో పాటు నాగార్జునసాగర్‌కు భారీ వరద వస్తున్న సమయంలో సొరంగాన్ని ఓపెన్ చేయడం వల్లనే ప్రమాదం జరిగిందని రాసింది. అదే అక్షరాలా నిజమని జలమండలి ప్రకటన తేటతెల్లం చేసింది. కృష్ణా వరదపై ఇంజినీర్లు అంచనా తప్పడంతోనే ఈ ఘటన జరిగిందని చెప్పింది. జలమండలి వివరణలోనూ ఆగస్టులో వరదలు వస్తాయనుకుంటే ముందుగా వచ్చాయని, అందుకే ఇలా జరిగిందని పేర్కొన్నది. కాకపోతే జలమండలి ఇంజినీర్లపై ఎలాంటి నెపం లేకుండా ఏజెన్సీపై నెపాన్ని నెట్టారు. కానీ 'నమస్తే తెలంగాణ' విచారణలో మాత్రం ఏజెన్సీ ఇంజినీర్లు వారించినా జలమండలి ఇంజినీర్లు సొరంగాన్ని ఓపెన్ చేయించారనే తేలింది. కారణం ఎవరైనా వారి అంచనాలు తప్పాయినందునే దుర్ఘటన జరిగిందనేది సుస్పష్టం. నాసిరకం నిర్మాణమో, డిజైన్ లోపమో కారణం కాదన్నది విస్పష్టం. మరోవైపు ఈ ఘటన వల్ల మార్చి నెలలో పూర్తి చేయాలనుకున్న పథకం రెండు నెలలు ఆలస్యం అవుతుందని వివరణలో పేర్కొన్నారు. కానీ నిపుణుల అంచనా మేరకు కనీసంగా ఏడాది కాలయాపన జరిగే అవకాశమున్నది.

లోకం పోకడ

ఇంట్లో వున్న కూరగాయలన్నీ మీరు తీసుకెళ్తే ఏం వండి చావను? అసలే కూరగాయలు దొరకక నేను చస్తుంటే!

జలమండలి ఇంజినీర్లు ఏం చేస్తున్నారు?

ప్రతికూల సమయంలో గేట్లు అమర్చి, సొరంగం ఓపెన్ చేయమన్నది ఎవరు? అనేది తేలితేనే బాధ్యులు ఎవరనేది నిర్ధారించవచ్చు. కానీ జలమండలి వివరణలో ఏజెన్సీ ఒక అంచనాలో ఉంది. కానీ, ఆ అంచనా తప్పడంతో ఈ ఘటన జరిగిందంటూ నెపాన్ని ఏజెన్సీపై వేసి ఎపిసోడ్‌ను ముగించాలనే ప్రయత్నం చేసింది. నిజంగా చూస్తే, సుంకిశాల పథకం పనులు ఓపెన్ టెండర్ల విధానంలో అప్పగించినవే. కానీ ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానంలో అప్పగించినవి కావు. అలాంటప్పుడు ఏజెన్సీనే ఒక అంచనాకు వచ్చి గేట్లు బిగించి, తనకు తానుగా సొరంగాన్ని ఓపెన్ చేస్తుంటే జలమండలి ఇంజినీర్లు ఏం చేస్తున్నారు? నిత్యం పనులను పర్యవేక్షించాల్సింది ఇంజినీర్లే కదా. పైగా గేట్ల బిగింపు, సొరంగం ఓపెన్ చేయడమనేవి అత్యంత కీలకమైన ఘట్టాలు. ఆ సమయంలో జలమండలి ఇంజినీర్లు ఎక్కడ ఉన్నారు? వారి విచక్షణ ఎక్కడికి పోయింది? నిజానికి ఇవి కదా విచారణలో తేలాల్సినవి.

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు సమస్యలను వివరిస్తున్న మహిళలు

ఖానాపూర్ ఎమ్మెల్యేను నిలదీసిన మహిళలు

ఆగ్రహం వ్యక్తం చేసిన వెడ్మ బొజ్జు పటేల్

ఖానాపూర్, ఆగస్టు 8 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులతోపాటు, పట్టణానికి చెందిన పలువురు మహిళలు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను నిలదీశారు. గురువారం పట్టణంలో వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులకు భూమిపూజ చేసేందుకు వచ్చిన ఎమ్మెల్యేను వారు పలు సమస్యలపై ప్రశ్నించారు. డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయంలో నెలకొన్న సమస్యలను, పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. డబుల్ బెడ్రూం ఇండ్లల్లో కొందరు ఉండటం లేదని, వారి స్థానంలో అర్హులైన వారికి ఇవ్వాలని స్థానిక నిరుపేదలు కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నదని, దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. మహిళలు వినకపోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

సాగర్‌లో గేట్లన్నీ ఎత్తారు

నందికొండ/ధరూరు/ అయిజ/శ్రీశైలం, ఆగస్టు 8 : నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో 26 క్రస్ట్ గేట్ల ద్వారా స్పిల్‌వే మీదుగా దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. సాగర్ రిజర్వాయర్ నీటి మట్టం 590 (312 టీఎంసీలు) అడుగులకుగాను గురువారం 585.90 (300 టీఎంసీలు) అడుగులకు చేరడంతో క్రస్ట్ గేట్లను 18 నుంచి క్రమంగా పెంచుకుంటూ 26 క్రస్ట్ గేట్ల ద్వారా (4 గేట్లు 10 అడుగులు, 22 గేట్లు 5 అడుగుల మేర ఎత్తి) 2,25,462 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు 3,52,158 క్యూసెక్కులు వస్తుండగా.. 2,72,019 క్యూసెక్కుల అవుట్‌ఫ్లోను మెయింటెన్స్ చేస్తున్నారు. సాగర్ క్రస్ట్ గేట్లు మొత్తం ఎత్తడంతో చూసేందుకు పర్యాటకులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. జూరాల ప్రాజెక్టుకు గురువారం ఇన్‌ఫ్లో 3.15 లక్షల క్యూసెక్కులు నమోదు కాగా 42 గేట్లు ఎత్తారు. ప్రాజెక్టు గేట్లు, విద్యుదుత్పత్తి, కాల్వల నుంచి 3,35,488 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది. శ్రీశైలం డ్యాంకు ఇన్‌ఫ్లో 3,54,761, అవుట్‌ఫ్లో 3,73,890 క్యూసెక్కులుగా నమోదైంది. పదిగేట్లు, విద్యుదుత్పత్తి నుంచి వరద దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు పరుగులు పెడుతున్నది.

'మేడిగడ్డకు 3,30,830 క్యూసెక్కుల వరద

మహదేవపూర్/కాళేశ్వరం/కన్నాయిగూడెం, ఆగస్టు 8 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల పరిధిలోని మేడిగడ్డ బరాజ్‌కు వరద తగ్గుతున్నది. గురువారం 3,30,830 క్యూసెక్కుల ప్రవాహం రాగా, మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అన్నారం బరాజ్‌కు మానేరు, కాల్వల ద్వారా 4,500 క్యూసెక్కుల నీరు వస్తుండగా, మొత్తం 66 గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్నారు. సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి ప్రవాహం పెరుగుతున్నది.

ఎమ్మెల్యే కవ్వంపల్లికి రుణమాఫీ సెగ

- **27వేల లోన్ మాఫీకాలేదని రైతు ఫిర్యాదు**
- **న్యాయం చేయాలని అన్నదాతల డిమాండ్**

కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కేశవపట్నం రైతు వేదికలో.. రుణమాఫీ కాలేదని ఎమ్మెల్యే కవ్వంపల్లితో మొర పెట్టుకుంటున్న రైతులు

శంకరపట్నం,ఆగస్టు 8: మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు రుణమాఫీ సెగ తగిలింది. గురువారం కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని కేశవపట్నం రైతు వేదికలో జరిగిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీకి ఎమ్మెల్యే హాజరు కాగా.. రుణమాఫీకాని రైతులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఆయనకు ఫిర్యాదు చేశారు. తాము మొలంగూర్ ఇండియన్ బ్యాంకులో రూ.లక్ష నుంచి రూ. 1.50 లక్షల వరకు రుణం తీసుకున్నట్టు చెప్పారు. రెండు దఫాలుగా రుణమాఫీ అయినా తమకు కాలేదని వాపోయారు. అందులో రూ.27 వేల రుణం కూడా మాఫీ కాలేదని రాజయ్య అనే రైతు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చాడు. ఇండియన్ బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం వల్ల రుణమాఫీ కాక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా బ్యాంకు సిబ్బందితో పాటు వ్యవసాయ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తమకు వెంటనే రుణమాఫీ జరిగేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

రుణమాఫీ ఫిర్యాదులపై పట్టింపేది?

- **కంటితుడుపుగా ఫిర్యాదుల స్వీకరణ**
- **ప్రతి జిల్లాల్లో వేల సంఖ్యలో వినతులు**
- **ఏఈవోలు, బ్యాంకుల వద్ద బారులు**
- **47 వేల మందికి మాఫీ కాలేదన్న మంత్రి**
- **ప్యాక్స్‌లో 30 వేలమందికి మొండిచేయి**
- **బీఆర్ఎస్ గ్రీవెన్స్‌కు 45 వేల ఫిర్యాదులు**

ఇంద్రవెల్లి రైతువేదికలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రం

హైదరాబాద్, ఆగస్టు 8(నమస్తే తెలంగాణ): అన్ని అర్హతలు ఉన్నా రుణమాఫీ కాకపోవటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేస్తేనైనా రుణమాఫీ అవుతుందేమోనన్న ఆశతో రైతులంతా గ్రీవెన్స్ సెల్‌కు పరుగులు తీస్తున్నా.. నిరాశే మిగులుతున్నది. రుణమాఫీపై రైతులు చేస్తున్న ఫిర్యాదులు పరిష్కారానికి నోచుకోవటం లేదు. రైతులు గొడవ చేయకుండా, వారి నుంచి వ్యతిరేకత రాకుండా ఉండేందుకు కంటితుడుపు చర్యగా ఫిర్యాదులు స్వీకరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో తీసుకున్న ఫిర్యాదులను ఉన్నతాధికారులకు పంపించకపోవటంతో ఫిర్యాదుల స్వీకరణ పరిష్కారానికి కాదని, రైతులను మభ్యపెట్టడానికే నని విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

ఏఈవోల వద్దకు, బ్యాంకులకు రైతుల క్యూ

రెండు విడతల్లో రూ.1.5 లక్షల వరకు రుణం కలిగిన 17.75 లక్షల మంది రైతులకు రూ.12,224 కోట్ల రుణాలు మాఫీ చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ మాఫీ లెక్కలు పేపర్‌పైనే ఉన్నాయి తప్ప క్షేత్రస్థాయిలో వేల మంది రైతులకు రుణమాఫీ కాలేదు. దీంతో రైతులంతా ఏఈవోలు, బ్యాంకులకు క్యూ కడుతున్నారు. తమకెందుకు రుణమాఫీ కాలేదని ఆరా తీస్తున్నారు. అధికారులు చెప్పే ఏవేవో కారణాలతో నిరుత్సాహంతో వెనుదిరుగుతున్నారు. ఆధార్ కార్డులో, పాస్‌బుక్‌లో పేర్లు వేరుగా ఉన్నాయని, రేషన్‌కార్డు లేదని, ప్రభుత్వ ఉద్యోగం ఉన్నదని, ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారని, పాస్‌బుక్ లేదని.. ఇలా ఏఈవోలు అనేక కారణాలు చెప్తున్నారు. బ్యాంకుల వద్దకు వెళ్లిన రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉన్నది. అక్కడ వాళ్ల గోడువినే నాథుడే లేకుండా పోయాడు. రుణమాఫీ జాబితాలో పేరుంటేనే తమ వద్దకు రావాలి.. లేదంటే తమకేం సంబంధం లేదంటూ బ్యాంకు అధికారులు తేల్చి చెప్తున్నారు.

జిల్లాల్లో ఫిర్యాదుల వెల్లువ

ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఫిర్యాదు కేంద్రాలకు, ఏఈవోల వద్దకు, బ్యాంకులకు కుప్పలుతెప్పలుగా ఫిర్యాదులు అందుతున్నాయి. సాంకేతిక కారణాలు, ఇతర సమస్యల వల్ల తొలి విడతలో 17 వేల మందికి, రెండో విడతలో 30 వేల మందికి రుణమాఫీ కాలేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా వెల్లడించారు. అంటే రెండు విడతల్లో కలిపి సుమారు 47 వేల మందికి రుణమాఫీ కాలేదు. ఇందులో 7 వేల మంది సమస్యలను మాత్రమే పరిష్కరించినట్టు మంత్రి తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో అధికారులు చేసిన తప్పులు, సాంకేతిక తప్పిదాలతో 30 వేలమందికి రుణమాఫీ కాలేదని టెస్కాబ్ బ్యాంకు అధికారులే వెల్లడించారు. 3,982 మంది రైతుల పేర్లు జాబితాలో చేర్చలేదని తెలిపారు.

బీఆర్ఎస్ నంబర్‌కు 45 వేల ఫిర్యాదులు

రుణమాఫీ కాని వారి కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రత్యేకంగా వాట్సాప్ ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తున్నది. ఈ నంబర్‌కు ఇప్పటికే 45 వేలకు పైగా ఫిర్యాదులు అందినట్టు ఆ పార్టీ తెలిపింది. జిల్లాల్లోనూ భారీ సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయి. 'నమస్తే తెలంగాణ' సేకరించిన వివరాల ప్రకారం ఫిర్యాదు కేంద్రాల్లో సుమారు 26 వేల వరకు ఫిర్యాదులు అందాయి. అత్యధికంగా ఖమ్మంలో 7,400, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 6 వేలు, మహబూబ్‌నగర్‌లో 1,300, జోగులాంబ గద్వాలలో 950, యాదాద్రి భువనగిరిలో 617, సూర్యాపేటలో 2,500, భూపాలపల్లిలో 1,721, ములుగులో 1,050, హనుమకొండలో 619, మహబూబాబాద్‌లో 262, రంగారెడ్డిలో 1,332, వికారాబాద్‌లో 2,218, నిర్మల్‌లో 1,290, వరంగల్‌లో 224 ఫిర్యాదులు అందాయి. ఇవి కేవలం రైతులు ఆఫీసుకు వచ్చి చేసిన ఫిర్యాదులే. ఏఈవోల వద్ద ఫిర్యాదులు ఇంతకు రెట్టింపు ఉంటాయని తెలిసింది. అయితే, ఈ ఫిర్యాదులు ఎంతవరకు పరిష్కారానికి నోచుకుంటున్నాయనేది ప్రశ్నార్థకంగా మారింది. క్షేత్రస్థాయిలో తీసుకున్న ఫిర్యాదులు ఉన్నతాధికారులకు పంపించటం లేదని తెలిసింది. ఇందుకు సంబంధించి వ్యవసాయశాఖ డైరెక్టరేట్‌లో ఎలాంటి విభాగాన్ని ఏర్పాటు చేయకపోవటం గమనార్హం. అసలు రాష్ట్రవ్యాప్తంగా రుణమాఫీపై ఎన్ని ఫిర్యాదులు అందాయనే లెక్కాపత్రం ఉన్నత